# మా ఉసురు తగులుతుంది

- చంద్రబాబు అండ్‌కో పై పింఛన్‌దారుల ఆగ్రహం
- ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరిక

ఒకటో తేదీ వచ్చిందంటే చాలు అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు చిందేవి. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇలా అందరి ఇళ్ల ముందుకు సూర్యోదయానికి ముందే వలంటీర్లు వచ్చేవారు. లబ్ధిదారుల యోగక్షేమాలు అడిగిమరీ పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. అయితే ఆ అభాగ్యులకు అండగా ఉండే వలంటీర్లపై చంద్రబాబు అండ్‌కో కక్ష గట్టింది. తమవారి ద్వారా ఈసీకి ఫిర్యాదు చేయడంతో వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో ఒకటో తేదీనే పింఛన్ అందుకోవాల్సిన లబ్ధిదారులకు నేటికీ పింఛన్ అందలేదు. లబ్ధిదారులందరూ చంద్రబాబు అండ్ కోపై శాపనార్థాలు పెడుతున్నారు. – సాక్షిబృందం



### సచివాలయానికెళ్లి పింఛన్ తీసుకోలేను

నా వయస్సు 75 ఏళ్లు. అనారోగ్యంతో మంచాన పడ్డాను. పింఛన్ వలంటీర్లు ఇవ్వడం లేదంట. సచివాలయం దగ్గర తీసుకోవాలని చెబుతున్నారు. పింఛన్ ద్వారానే నా జీవనం సాగుతోంది. ఎప్పుడూ ఒకటో తేదీనే ఇచ్చే వారు. 3వ తేదీ అవుతున్నా నేటికీ పింఛన్ రాకపోవడం బాధ కలిగిస్తోంది. మా మీద చంద్రబాబుకు ఎందుకంత కోపమో ?

– శ్రీరామప్ప, మరవపల్లి, చాగలేరు, చిలమత్తూరు మండలం

### మా పాలిట దైవం జగన్

రోడ్డు ప్రమాదంలో నా రెండు కాళ్లు పోయాయి. దీంతో మంచానికే పరిమితం అయ్యాను. ప్రభుత్వమిచ్చే రూ.3 వేల పింఛనే మా జీవనాధారం. ప్రతినెల ఠంచనుగా పింఛన్ ఇస్తున్న జగనన్న మా పాలిట దైవం. చంద్రబాబు కుట్రలతో ఈసారి నాకు పింఛన్ ఇంకా రాలేదు. చాలా బాధగా ఉంది.

– హరి, కురుబవాండ్లపల్లి, పెనుకొండ మండలం





### ఓటుతో బుద్ధి చెబుతాం



నెల మొదలయ్యిందంటే చాలు పొద్దున్నే ఆరుకే తలుపు తట్టి పింఛన్ ఇచ్చే వాళ్లు. ఇప్పుడు పంచాయతీ ఆఫీసు దగ్గరకు రావాలంటున్నారు. ఇప్పటికే మూడు రోజులు ఆలస్యమైంది. మాలాంటి దివ్యాంగులు అంత దూరం ఎలా వెళ్లగలం. చంద్రబాబే పింఛన్ డబ్బుల పంపిణీకి అడ్డుపడ్డాడంట. ఓటుతో చంద్రబాబుకు బుద్ధిచెబుతాం.

– రామచంద్రప్ప, శానిగానిపల్లి, చిలమత్తూరు మండలం

### పేదలు ఏం అన్యాయం చేశారు?



ప్రతి నెలా 1వ తేదీనే ఠంచన్‌గా వలంటీర్లు పింఛన్ అందించే వాళ్లు. చంద్రబాబు వల్ల మూడో తేదీ వస్తున్నా పింఛన్ మాత్రం అందలేదు. మాలాంటి నిరుపేదల మీద ఆయనకు ఎందుకంత కోపమో అర్థం కావడం లేదు. ఈ పాపం చంద్రబాబుకు కచ్చితంగా తగులుతుంది.

– షహనాజ్, పెనుకొండ

### ఇబ్బంది పెట్టడం సరికాదు



ప్రతి నెలా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. కానీ ఎప్పుడూ లేని విధంగా ఈనెల పింఛన్ డబ్బులు అందలేదు. చంద్రబాబు వల్లే ఈసీ వలంటీర్లను దూరం చేసిందని తెలిసింది. పింఛన్ డబ్బులతో బతికే మాలాంటోళ్లను ఇబ్బంది పెట్టడం సరికాదు.

– షహీనా, పెనుకొండ

### పేద ప్రజల ద్రోహి చంద్రబాబు



ప్రతి నెలా ఇంటి వద్దకు వచ్చి వలంటీర్ నాకు పింఛన్ ఇచ్చేవారు. కానీ చంద్రబాబు పేద ప్రజలను కష్టాల పాలు చేయడానికి సచివాలయాల వద్దకు వెళ్లి తీసుకునేలా చేస్తున్నారు. టీడీపీకి ఓటు వేస్తే జన్మభూమి కమిటీ సభ్యుల ఇళ్ల వద్దకు వెళ్ళి తీసుకోవాల్సి వస్తుందేమో? జగనన్నకు మంచి పేరు వస్తుందని కుట్ర పన్నుతున్నారు.

– రామకృష్ణ, సోమందేపల్లి

### ఉసురు తగులుతుంది



ఒకటో తేదీనే నాకు వితంతు పింఛన్ వచ్చేది. చంద్రబాబు వల్ల నేటికీ పింఛన్ అందలేదు. మాలాంటోళ్లకు పింఛన్ రాకుండా చేసిన వారికి మా ఉసురు తగిలి నాశనమై పోతారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై ఎందుకు ఇంత కక్ష సాధిస్తున్నారో అర్థకం కావడం లేదు.

– లక్ష్మమ్మ, రొద్దం

### మాలాంటోళ్ల కడుపు కొడతారా?



నాకు ఐదేళ్లగా కాళ్లు చచ్చుబడిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే పింఛన్ మంజూరైంది. ప్రతి నెలా ఒకటో తేదీ వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. అయితే ఈ నెల ఆలస్యమవడంతో ఎందుకు రాలేదో ఆరా తీశాను. చంద్రబాబు కోర్టు ద్వారా వలంటీర్లను తప్పించారని తెలిసింది. మాలాంటోళ్ల కడుపు కొట్టడం ఆయనకు మంచిది కాదు. ఓటుతో బాబుకు బుద్ధిచెప్పి మళ్లీ జగనన్నను సీఎం చేసుకుంటాం.

– లోకన్న, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

## చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పండి



రొళ్ల మండలం రత్నగిరిలో రాజవంశీకుడు దొర రంగప్పరాజును కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

- మడకశిర అసెంబ్లీ అభ్యర్థి ఈరలక్కప్ప

**మడకశిర:** 'టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర పన్ని అభాగ్యులకు వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారు. బాబుకు ప్రజలందరూ ఓటుతోనే తగిన బుద్ధి చెబుతారు' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప విమర్శించారు. ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేయకుండా అడ్డుకోవడం చాలా అన్యాయమన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అవ్వాతాతలు పింఛన్లు తీసుకోవడానికి క్యూలో నిలబడి ఇబ్బందులు పడేవారని తెలిపారు. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి ఇంటి వద్దకే పింఛన్లు అందిస్తున్నారని చెప్పారు. పింఛన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబుకు అవ్వాతాతల ఉసురు తగలడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తారని తెలిపారు. ఓటర్లందరూ మరోసారి సంక్షేమ ప్రదాత అయిన జగన్‌కు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

### వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి

**రొళ్ల:** త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజవంశీకుడు దొర రంగప్పరాజు ఇంటికెళ్లి ఆయన మద్దతు కోరారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఆచరణకు సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగనన్నకే మరోసారి ప్రజలంతా పట్టంకట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాజ వంశీకుడు దొర రంగప్పరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు విజయరంగేగౌడు, హెక్బల్‌బాషా, బసవరాజు, కాకి వైఎస్ సర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



బేవనహళ్లిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

**హిందూపురం:** అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుబ దీపిక అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం హిందూపురం మండలం బేవనహళ్లి, నక్కలపల్లి, సంజీవరాయన పల్లి, ఉడుగులపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీలతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ అభ్యర్థి టీఎస్.దీపిక మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో దాదాపు 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. విద్య, వైద్యం, రైతు, ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో అవ్వతాతలు, వితంతు, వికలాంగుల గోడు టీడీపీ అధినేత చంద్రబాబుకు తగలకమానదన్నారు. ఇన్నాళ్లు ఠంచనుగా 1వ తేదీనే ఇంటి ముంగిటకే వలంటీర్ల ద్వారా పింఛన్ అందించారని, చంద్రబాబు నీచ రాజకీయం వల్ల ఈసారి లబ్ధిదారులకు పింఛన్ ఇంటి వద్దకు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితమైన ఎమ్మెల్యే బాలకృష్ణ పురం అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. తాను స్థానికంగానే ఉండి సేవలందిస్తానని, వచ్చే ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ రత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యులు నాగభూషన్, ఎంపీటీసీ సభ్యులు కృష్ణవేణి రెడ్డి, నాగభూషణ్, మల్లేష, షామింతాజ్, సర్పంచులు ఆనం నంజప్పా, దేవరాజు, ఆదెప్ప, మూర్తి, కౌన్సిలర్ మారుతీరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీరాంరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, లోకేష్‌రెడ్డి, బాబురెడ్డి, మారుతీరెడ్డి, నాగరాజు, గోపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**హిందూపురం మండలంలో..**

మీనగుంటపల్లి, రాచేపల్లి, చలివేందుల గ్రామాల్లోనూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక ప్రచారం చేశారు. ఇంటింటికీ సంక్షేమాభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. సర్పంచ్ ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



గోరంట్ల: రాజీనామా లేఖను ఏఓ సూర్యనారాయణకు అందిస్తున్న వలంటీర్లు

**పెనుకొండ రూరల్:** మండలంలోని నాగలూరు, మావటూరు, మునిమడుగు పంచాయతీ గ్రామాల్లోని వాలంటీర్లు ముకుమ్మడి రాజీనామాలు చేశారు. ప్రతిపక్షాల కుట్రలో భాగంగా తమ విధులను అడ్డుకోవడంతోనే రాజీనామా చేసినట్లు వలంటీర్లు తెలిపారు.

**పరిగి:** మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్ వ్యవస్థను కించపరచడమే కాకుండా వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారని వారు తెలిపారు. అందుకు నిరసనగానే రాజీనామాలు చేసి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ సచివాలయంలో రాజీనామాలను పంచాయతీ సెక్రటరీ నజ్మాకు అందించారు.

**చిలమత్తూరు:** వలంటీర్లపై టీడీపీ, జనసేన కక్ష కట్టి ప్రజలతో తమకున్న అనుబంధాన్ని దూరం చేస్తున్నారన్న మనస్థాపంతో కోడూరు సచివాలయం –1కి చెందిన ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం ఎంపీడీఓ రామ్‌కుమార్‌ను కలసిన వలంటీర్లు దేవనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు రాజీనామా పత్రాలను అందజేశారు.

**గోరంట్ల:** నిస్వార్థంగా పేద ప్రజలకు సేవలందిస్తున్న తమపై ప్రతిపక్ష పార్టీలు కుట్ర చేసి సంక్షేమ పథకాలను ప్రజలకు అందకుండాచేయడాన్ని నిరసిస్తూ మండలంలో 23 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు మల్లాపల్లికి చెందిన వలంటీర్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సూర్యనారాయణకు రాజీనామాలను అందజేశారు.

## పింఛన్‌దారులపై కక్ష సాధింపు ఎందుకు?



బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- చంద్రబాబుపై మంత్రి ఉషశ్రీచరణ్ ఫైర్

**పెనుకొండ రూరల్:** టీడీపీ అధినేత చంద్రబాబుకు ప్రజా బలమే ఉంటే వలంటీర్లు, పింఛన్‌దారులపై కక్ష సాధింపు ఎందుకని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ చరణ్ ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, గుట్టూరు, అమ్మవారపల్లి, శెట్టిపల్లి పంచాయతీ గ్రామాల్లో బూత్ కమిటీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకనే చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. అందులో భాగంగా ఈసీకి ఫిర్యాదు చేయడం ద్వారా వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా అడ్డుకున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువు, ఒంటరి మహిళలకు ఫించన్లు ఇవ్వకుండా అడ్డుకోవడంతో ద్వారా చంద్రబాబు మరోసారి తన దిగుజారుడు తనాన్ని చాటుకున్నారన్నారు. ముఖ్యమంత్రి అభివృద్ధి , సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పోగాకు రామచంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరాములు, మండల కన్వీనర్ నాగలూరు బాబు, సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, సర్పంచులు అశ్వర్థనారాయణ, నాగరత్నమ్మ, గౌతమి , నాయకులు రామ్మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కర్రా సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రారెడ్డి, అశ్వర్థరెడ్డి, ఆదినారాయణ, నడిపి వెంకటరెడ్డి, వేములేటి ప్రసాద్‌రెడ్డి, కాంట్రాక్టర్ రాము, మల్లికార్జున, సాయిరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**రొద్దం మండలంలో...**

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు గ్రామ పంచాయతీ రొప్పాల గ్రామంలో మంగళవారం సాయంత్రం మంత్రి ఉషశ్రీచరణ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, స్థానిక సర్పంచ్ అశ్వర్థమ్మ, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య పాల్గొన్నారు.

### సీఎంను కలిసిన మంత్రి ఉషశ్రీచరణ్ దంపతులు



**పెనుకొండ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీచరణ్, ఆమె భర్త చరణ్‌రెడ్డి సోమవారం రాత్రి కదిరిలో కలిశారు. పెనుకొండపై మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించినట్లు మంత్రి పేర్కొన్నారు.



### ఉచిత నిర్ధారణ పరీక్షలు

**హిందూపురం టౌన్:** పట్టణంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఉపకరణ నిర్ధారణ పరీక్ష నిర్వహించారు. ఎంఈఓ గంగప్ప అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జిల్లా ఆల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు పాల్గొన్నారు. నిర్ధారణ పరీక్షల ద్వారా వారికి అవసరమైన ఉపకరణాలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.

### 9న ఉగాది కవి సమ్మేళనం

**హిందూపురం టౌన్:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 9న ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జేవీవీ తాలుకా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి పేర్కొన్నారు. కవితా అభిరుచి కలిగిన వారు, సమాజ సంక్షేమానికి ఉపయోగపడేలా కవితలతో హాజరుకావాలని కోరారు.

### నేడు జ్యోతుల ఉత్సవం

**అమరాపురం:** మండలంలోని కె.శివరం గ్రామంలో వెలసిన కరియమ్మ దేవికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



## క్లుప్తంగా

### టీడీపీని చిత్తుగా ఓడించాలి



టీడీపీ వర్గీయులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

**మడకశిరరూరల్:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ నేతలు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు వైఎన్ రవిశేఖర్ రెడ్డి, రంగేగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జిల్లా పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడు హనుమంతరెడ్డి సమక్షంలో ఎగువ అచ్చంపల్లి గ్రామానికి చెందిన తిమ్మరాయప్పతో పాటు 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో ఉండలేక వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వివిధ కమిటీ సభ్యులు రామాంజప్ప, శేషాద్రి, రమేష్, కల్లుమర్రి శ్రీరాములు, ధని, నాగానాయక్, విజయ్, గోపాల్‌నాయక్, నాగరాజు బీసీ సెల్ నాయకుడు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

### ప్రచారం ముమ్మరంగా చేయండి



కమిటీ సభ్యులకు కిట్లు అందిస్తున్న వాగేష్

**అమరాపురం:** వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా మండలంలోని బూత్ కమిటీ సభ్యులు ఇంటింటి ప్రచారం జోరుగా చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కె.శివరం గ్రామంలో బూత్ కమిటీ సభ్యులకు ప్రచార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, నాయకులు నటరాజు, పీఆర్.మూర్తి, ఇషాక్, చిత్తప్ప యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫర్నీచర్ ధ్వంసంపై కేసు నమోదు

**హిందూపురం అర్బన్:** హిందూపురం మున్సిపల్ కార్యాలయం పరిధిలో చేపట్టిన పనులకు బిల్లులు చేయలేదని కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.శ్రీనివాసులు తెలిపారు.

### ఘనంగా జాతరోత్సవం



తాడమ్మదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

**పావగడ:** కురుబల ఆరాధ్య దైవం తాడ వీరనాగమ్మదేవి జాతరోత్సవం పి రొప్పం గ్రామంలో సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. నాగలమడక ఉత్తర పినాకిని నది వద్దకు అమ్మవారిని భక్తులు కాలి నడకన తరలించారు. అక్కడ అమ్మవారికి గంగ పూజలు జరిపి అనంతరం గుడి వద్దకు తీసుకొచ్చారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ జాతరోత్సవాన్ని నిర్వహించారు.

### గుండెపోటుతో తప్పెట కళాకారుడి మృతి



గంగరాజు (ఫైల్)

**పావగడ:** స్థానిక తప్పెట కళాకారుల సంఘం కోఆర్డినేటర్ గంగరాజు (41) మంగళవారం గుండెపోటుతో చనిపోయారు. మృతుడికి భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల తప్పెట కళాకారుల సంఘం సభ్యులు కే వెంకటేష్, సుబ్బరాజు, కవిత, అక్కమహాదేవి తదితరులు సంతాపం తెలిపారు.

### సాయుధ బలగాల కవాతు

**హిందూపురం అర్బన్:** పట్టణంలో మంగళవారం రాత్రి సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని అహమ్మద్‌నగర్, బెంగళూరు రోడ్డులలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవాతు చేశారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ సూచించారు.

### ప్రచారం వాయిదా

**రొళ్ల:** మండల పరిధిలోని హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రం నుంచి బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రారంభం కావాల్సిన ఇంటింటి ప్రచారాన్ని వాయిదా వేసినట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. తదుపరి ప్రచారాన్ని కార్యక్రమాన్ని తెలియజేస్తామన్నారు.